MRR 69 TV


అవినీతిపై అక్షర సమరం

మన అంకుశం


సంచలన సాయంకాలం దినపత్రిక

ఎడిటర్ : మచ్చా రామలింగారెడ్డి | సంపుటి : 6 | సంచిక : 45 | సోమవారం 30 మార్చి 2026 | పేజీలు : 4 | వెల : 3/-









## పేదల కోసం మరో 17 లక్షల ఇళ్లు..

# 2029 నాటికి అందరికీ ఇస్తాం

**నాయుడుపేటలో లబ్ధిదారుల ఇళ్లలో అట్టహాసంగా గృహప్రవేశాలు**

**లబ్దిదారుల చేతికి ఇంటి తాళాలు అందజేసిన సీఎం చంద్రబాబు**

**మత్స్యకారులకు నష్టం వాటిల్లకుండా కలెక్టర్లకు బాధ్యతలు అప్పగింత**

**ఏప్రిల్ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఆకస్మిక తనిఖీలు చేస్తా.. గత పాలకులు మూడు ముక్కలాటతో రాజధానిని ముక్కలు చేశారు**



**(అంకుశం, నాయుడుపేట, మార్చి 30):** తిరుపతి జిల్లా సూళ్లూరుపేట నియోజకవర్గం నాయుడుపేటలో నిర్మించిన టిడ్కో ఇళ్లు, గృహ నిర్మాణ సంస్థ ద్వారా నిర్మించిన 2.50 లక్షలకు పైగా ఇళ్లలో సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో సోమవారం గృహ ప్రవేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల ఇళ్లలో ప్రత్యేకంగా పూజలు నిర్వహించి శాస్త్రోక్తంగా పాలను పొంగించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.. 2029 నాటికి అందరికీ ఇళ్లు ఇవ్వాలంటే ఇంకా 17 లక్షల పైచిలుకు ఇళ్లు నిర్మించాల్సి ఉంది. ఈ ఏడాది జూన్ నాటికి 2 లక్షల ఇళ్లు, సెప్టెంబరుకు 1.60 లక్షల ఇళ్లలో గహ ప్రవేశాలు చేయిస్తాం. రాష్ట్రంలో పేదలకు ఉచితంగా ఇళ్ల స్థలాలు ఇస్తాం. దీపం 2.0 కింద మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నాం. భవిష్యత్తులో పైప్డ్ గ్యాస్

- మిగతా 2లో




## సరైన పత్రాల్లేని 193 బస్సులపై కేసులు నమోదు

**రోడ్డు ప్రమాదాల నివారణకు కఠిన తనిఖీలు.. రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి**



**(అంకుశం, అమరావతి, మార్చి 30):** రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక తనిఖీలు కొనసాగుతున్నాయని, ఇష్టానుసారంగా వాణిజ్య సరుకులు తీసుకెళ్తున్న, అధిక లోడ్‌తో నడుస్తున్న ప్రైవేట్ బస్సులపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి వెల్లడించారు. ఈమేకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 976 బస్సులను తనిఖీ చేసినట్లు మంత్రి పేర్కొన్నారు. సరైన పత్రాలు లేని 193 బస్సులపై కేసులు నమోదు చేసి జరిమానాలు విధించినట్లు తెలిపారు. రాష్ట్రంలోని టోల్‌ప్లాజాలు, చెక్‌పోస్టులు కలిపి మొత్తం 16 పాయింట్లలో ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మంత్రి ఆదేశాలతో అధికారులు ప్రత్యేక డ్రైవ్‌లు కొనసాగిస్తున్నారని వెల్లడించారు. భద్రతా నియమాలను ఉల్లంఘించే వారిపై ఎటువంటి ఉపేక్ష లేకుండా కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి స్పష్టం చేశారు. ప్రయాణికుల భద్రతే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని, అందరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి కోరారు.

## బాలల బంగారు భవిష్యత్తుకు బాటలు వేసేలా పని చేస్తాం

**ప్రమాణ స్వీకారోత్సవంలో బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్ పర్సన్ సూర్యనారాయణ రాజు**



**(అంకుశం, అమరావతి, మార్చి 30):** బాలల బంగారు భవిష్యత్తుకు బాటలు వేసేలా పనిచేస్తామని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్ పర్సన్ సూర్యనారాయణ రాజు వెల్లడించారు. సోమవారం ఆయనతో పాటు మరో ఆరుగురు సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం చైర్ పర్సన్ సూర్యనారాయణ రాజు మాట్లాడుతూ.. సభ్యులు సమన్వయంతో బాలల హక్కుల పరిరక్షణలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దేశంలోనే అగ్రస్థానంలో నిలిపేందుకు కషి చేస్తామన్నారు. రాష్ట్రస్థాయి, జిల్లాస్థాయి అధికారుల సమన్వయంతో చైల్డ్ ఫ్రెండ్లీ స్టేట్‌గా ఆంధ్రప్రదేశ్‌ని నిలుపుతామన్నారు. బాలల హక్కులకు భంగం వాటిల్లితే తక్షణమే కమిషన్ దష్టికి తీసుకు రావాలని కోరారు. అంతకుముందు కమిషన్ నూతన చైర్ పర్సన్‌గా వేటుకూరి ఏవిఎస్ సూర్యనారాయణ రాజు, సభ్యులుగా కే.జీ వెంకట పద్మలత, డా. ధోని శ్రీనివాస్ మూర్తి, ఉండవల్లి గాంధీ బాబు, చల్ల మధుసూదన రావు, మండల గంగ సూర్యనారాయణ, పి.నాగ మానస పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సెక్రటరీ ఉమాదేవి సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ వైద్య విద్యార్థుల పరిశోధనలకు ప్రోత్సాహం!

**విద్యార్థులకు ఉపకార వేతనాలు, ఫ్యాకల్టీకి రీసెర్చ్ గ్రాంట్ పెంపు**

**పూర్వ వైద్య విద్యార్థుల అసోసియేషన్లను ఒకే తాటిపై తెచ్చేందుకు కృషి**

**ఎన్టీఆర్ వర్శిటీ ఉపకులపతి డాక్టర్ చంద్రశేఖర్ వెల్లడి**



**(అంకుశం, అమరావతి, మార్చి 30):** ప్రభుత్వ వైద్య కళాశాలల్లో పరిశోధనలు, క్రీడలను ప్రోత్సహించేందుకు ప్రత్యేకంగా నిధులను కేటాయిస్తున్నామని ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ పుల్లల చంద్రశేఖర్ వెల్లడించారు. వైద్య విద్యలో ప్రమాణాల పెంచేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తీసుకుంటున్న చర్యలకు కొనసాగింపుగా విశ్వవిద్యాలయం తరపున కూడా కొత్త నిర్ణయాలు తీసుకున్నామని తెలిపారు వైద్య విద్య ప్రమాణాల పెంపుతోపాటు వ్యాధుల నిరోధ చర్యల్లో కూడా విశ్వవిద్యాలయం భాగస్వామ్యం కాబోతుందన్నారు ఇందులో భాగంగా ఏఐ బేస్డ్ డిసీజ్ మోడలింగ్ అండ్ డెసిషన్ సెంటర్ను కూడా ఏర్పాటుచేస్తున్నామని వెల్లడించారు విజయవాడలోని విశ్వవిద్యాలయంలో సోమవారం మద్యాహ్నం జరిగిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ‘ఈ నెల 17వ తేదీ విశ్వవిద్యాలయంలో జరిగిన 244వ పాలకవర్గ సమావేశం వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి సౌరబ్ గౌర్ అధ్యక్షతన జరిగింది. కేవలం అల్లోపతి వైద్యంలో మాత్రమే కాకుండా ఆయుష్ డెంటల్, నర్సింగ్, ఫిజియోథెరపీ, ఎలైడ్ సైన్సెస్ (పారా మెడికల్), ఇతర వైద్య కోర్సుల్లో చదివే విద్యార్థులు, బోధకులు (ఫ్యాకల్టీ) పరిశోధనలవైపు దష్టిపెట్టేలా, క్రీడలను ప్రోత్సహించేలా, పూర్వ వైద్య విద్యార్థుల సహకారాన్ని పొందేందుకు వీలుగా నిర్ణయాలు జరిగాయి. వీటిని కార్యాచరణలోనికి తెచ్చేందుకు ఏటా రూ. 22.13 కోట్ల వరకు వ్యయమవుతుంది. తాజాగా తీసుకున్న నిర్ణయాలు మూడేళ్లపాలు కొనసాగుతాయి. తదుపరి మరోమారు పునఃపరిశీలన చేసి, నాటి అవసరాలకు తగ్గట్లు చర్యలు తీసుకుంటారు‘ అని ఉపకులపతి డాక్టర్ చంద్రశేఖర్ వివరించారు. సమావేశంలో రిజిస్ట్రార్ డాక్టర్ టి. సాయిసుధీర్, వర్శిటీ రీసెర్చి అండ్ డెవలప్మెంటు డైరెక్టర్ డాక్టర్ ఎం. లక్ష్మీసూర్యప్రభ, సి ఓ ఈ శ్రీకాంత్ పాల్గొన్నారు.

## బీజేపీ, ఎల్‌డీఎఫ్ కుమ్మక్కు వల్లే శబరిమలపై మోదీ మౌనం



- ఎన్నికల్లో కలిసొచ్చే మతపరమైన అంశాలపైనే ప్రధాని మాట్లాడుతారు
- శబరిమలలో ఏం జరిగిందో మోదీ మర్చిపోయారు
- అయ్యప్ప ఆలయం బంగారం స్థానంలో ఇత్తడిని పెట్టారు

# నక్సలిజం దాదాపు అంతమైంది

ఆయుధాలను చేపట్టే వారిని కేంద్ర ప్రభుత్వం వదిలిపెట్టబోదని కేంద్రహోంశాఖమంత్రి అమిత్ షా హెచ్చరించారు. నక్సల్స్ అందరూ ఆయుధాలు వీడి జనజీవనంలో కలవాల్సిందేనని తేల్చిచెప్పారు. నక్సలిజం నిర్మూలనపై లోక్‌సభలో ప్రసంగించిన కేంద్ర హోం మంత్రి బస్తర్‌లో నక్సలిజం దాదాపు అంతమైందని తెలిపారు. బస్తర్‌లో ప్రతి గ్రామంలో పాఠశాల ఏర్పాటు చేశామన్న అమిత్ షా, తెలంగాణలో అనేకమంది నక్సల్స్ నేతలు లొంగిపోయారని గుర్తు చేశారు. నక్సల్స్ రహిత దేశంగా భారత్‌ను మార్చామని అమిత్ షా వెల్లడించారు. కాంగ్రెస్ 60 ఏళ్లు అధికారంలో ఉన్నా ఆదివాసీల జీవితాల్లో మార్పు రాలేదని విమర్శించారు. ఎన్?డీఏ వచ్చాకే ఆదివాసీ, గిరిజన గ్రామాల్లో రోడ్లు, తాగునీ రు, విద్యుత్ సౌకర్యాలు వంటి మౌలిక వసతులు కల్పించినట్లు తెలిపారు. గిరిజన యువకులకు ఉపాధి కల్పించామని చెప్పారు. నక్సలిజంపై పోరులో ప్రజలు కూడా తమకు అండగా నిలిచారని వివరించారు. ఎందరో భద్రతా సిబ్బందిని నక్సలైట్లు పొట్టనపెట్టుకున్నారన్న అమిత్ షా దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన సైనికులకు శ్రద్ధాంజలి ఘటిస్తున్నామని తెలిపారు.

### ప్రాణాలు తీసే హక్కు నక్సల్స్‌కు ఎక్కడిది?

మనం ప్రజాస్వామ్య దేశంలో ఉన్నాం, రాజ్యాంగాన్ని స్వీకరించాం. ఆయుధాలు చేపట్టి ప్రజల ప్రాణాలు తీయాలని ఏ సిద్ధాంతాలు చెప్పాయి? ప్రజల ప్రాణాలు తీసే హక్కు ఎవరికీ లేదని నక్సల్స్ గ్రహించాలి. స్కూళ్లు, బ్యాంకులు, ఆస్పత్రులు తగులబెట్టేవారి వల్ల అభివృద్ధి ఎలా సాధ్యం? ఆయుధాలు చేతుల్లోకి తీసుకోవడం ఏ సమస్యకూ పరిష్కారం కాదు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల నుంచే నక్సలిజం అభివృద్ధి చెందింది. ఇందిరాగాంధీ వల్లే మావోయిస్టు పార్టీ అన్ని ప్రాంతాలకూ విస్తరించింది. సైనిక బలగాలు, పోలీసులు, స్టేషన్లపై దాడి చేసి వాళ్లు ఆయుధాలు దోచుకెళ్లారు. నక్సల్స్ వద్ద ఉన్న వాటిలో 52 శాతం ఆయుధాలు పోలీసుల నుంచి దోచుకెళ్లినవేనని అమిత్ షా పేర్కొన్నారు. ఇప్పుడు ప్రతి ఒక్కరూ అభివృద్ధి గురించే ఆలోచిస్తున్నారని, అయితే మావోయిస్టుల ఎజెండాలో అభివృద్ధి అన్నది లేదని, వారు ఉనికి కోసమే పోరాడుతున్నారని అమిత్ షా పేర్కొన్నారు. నక్సలైట్లను భగత్‌సింగ్, బిర్సాముండా వంటివారితో పోల్చకూడదన్న ఆయన, ప్రజలను చంపేవారు దేశభక్తులు ఎలా అవుతారని ప్రశ్నించారు. నక్సలైట్లు తమ సిద్ధాంతాలను విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారని, వారికి ఆదర్శం భారతీయులెవరూ కాదని, వారికి మావో ఆదర్శమని అమిత్ షా అన్నారు. ఆయుధాలు చేతుల్లోకి తీసుకోవడం ఏ సమస్యకూ పరిష్కారం కాదని అమిత్ షా స్పష్టం చేశారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల నుంచే నక్సలిజం అభివృద్ధి చెందిందని ఆరోపించారు. ఆయుధాలు చేపట్టి ప్రజల ప్రాణాలు తీయాలని ఏ సిద్ధాంతాలు చెప్పాయని అమిత్ షా నిలదీశారు. అన్యాయానికి వ్యతిరేకంగా పోరా డుతున్నామంటూనే సాయుధ ఉద్యమాలను సమర్థిస్తున్న వారిని నేనొక్కటే అడుగుతున్నాను. మీరు రాజ్యాంగాన్ని గౌర విస్తారా? లేదా? ఎవరికైనా అన్యాయం జరిగితే దానికి పరిష్కా రం మన రాజ్యాంగంలో ఉంది. న్యాయస్థానాలు, శాసనస భలు, జిల్లా పరిషత్తులు, తహసీల్దార్ కార్యాలయాలు ఏర్పాటు చేశారు. ఈ వ్యవస్థను పూర్తిగా తిరస్కరించి ఆయుధాలను చేతుల్లోకి తీసుకుంటారా? ఎవరైతే వామపక్ష భావాజలాన్ని సమర్థిస్తున్నారో వాళ్లకు ఓ విషయం చెప్పాలనుకుంటున్నాను. సాయుధ పోరాటాలు చేసే రోజులు పోయాయి. ఇది నరేంద్ర మోదీ ప్రభుత్వం. ఎవరైనా ఆయుధాలు పట్టుకుంటే వాళ్లని వదిలిపెట్టం. ఇటువంటి ప్రవర్తనను ఎంతమాత్రం సహించేది లేదు.

### చిన్న పిల్లలకు తుపాకులు

నక్సల్స్ చిన్నపిల్లలకు తుపాకులు, ఆయుధ సామగ్రి ఇచ్చారని, ఏజెన్సీ ప్రాంతాల యువతీయువకుల జీవితాలను వారు నాశనం అమిత్ షా ఆరోపించారు. నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో నిరక్షరాస్యత ఎక్కువగా ఉందని, అందుకు కారణం విద్య, వైద్య, మౌలిక వసతులను నక్సల్స్ ధ్వంసం చేయడమే కారణమని పేర్కొన్నారు. రోడ్లు, విద్యుత్ లేకుండా గిరిజన ప్రాంతాలు ఎలా అభివృద్ధి చెందుతాయని ఆయన ప్రశ్నించారు.

### చర్చల ద్వారానే పరిష్కారం

దేనికైనా చర్చల ద్వారానే పరిష్కారం లభిస్తుందని, తుపాకులతో కాదని అమిత్? షా హితవుపలికారు. మాట్లాడితే ప్రజాస్వామ్యం అంటారు. మరి హింసను ఎలా సమర్థిస్తారు? కాంబోడియా, పెరూ, కొలంబియాలో భయంకర రక్తపాతం జరిగింది. దేశాభివృద్ధికి మావోయిస్టు సిద్ధాంతాలు, విధానాలు తీవ్ర ఆటంకం కలిగిస్తున్నాయి. మావోయిస్టుల రక్తపాత సిద్ధాంతాన్ని ప్రజలంతా వ్యతిరేకిస్తున్నారు. బస్తర్‌లో నక్సల్స్ అనేక ఏళ్లపాటు సమాంతర ప్రభుత్వం నడిపారు. ఆయుధాలు వీడాలని బస్తర్ వెళ్లి పలుమార్లు కోరాం. లొంగిపోయిన నక్సల్స్‌కు పునరావాసం, ఇతర సౌకర్యాలు కల్పిస్తున్నాం. కానీ నక్సల్స్? పలుచోట్ల రైలు బోగీలు తగలబెట్టారు. ప్రజల నుంచి డబ్బు వసూలు చేశారు. అంతేకాదు ప్రభుత్వ పథకాల అమలును కూడా నక్సలైట్లు అడ్డుకున్నారు. నక్సలిజం అభివృద్ధి కోసం రాలేదు. వామపక్ష భావజాల వ్యాప్తి కోసం వచ్చింది. నక్సలిజాన్ని రూపుమాపిన ఘనత కేంద్ర, రాష్ట్ర పోలీసు బలగాలదే. మావోయిస్టు పార్టీ చైనా నుంచి వచ్చింది. చైనా నుంచి వచ్చిన పార్టీకి ఇక్కడి ప్రజల సమస్యలు ఎలా తెలుస్తాయి? మావోయిస్టు పార్టీ సిద్ధాంతం దేశాభివృద్ధి కాదు. ప్రజల చేత ఎన్నికైన ప్రభుత్వాలపై తిరుగుబాటు చేయడమే వారి సిద్ధాంతం. మావోయిస్టు పార్టీ మూల సిద్ధాంతాలు దారుణంగా ఉంటాయి.

### ఎందుకు ఇన్ని వామపక్ష పార్టీలు?

'మేం వచ్చిన 12 ఏళ్లలో నక్సలిజాన్ని పూర్తిగా నిర్మూలించాం. రష్యాలో కమ్యూనిస్టులు అధికారంలోకి వచ్చాక ఇండియాలో సీపీఐ ఏర్పడింది. సీపీఐ ఏర్పాటు వెనుక రష్యా కమ్యూనిస్టుల హస్తం ఉందన్న వాదన ఉంది. కమ్యూనిస్టులు ఆంగ్లేయులను కూడా సమర్థించారు. సీపీఐ ఉన్నాక మళ్లీ సీపీఐ (ఎం) ఎందుకు ఏర్పడింది? సీపీఐ, సీపీఎం తర్వాత మళ్లీ మావోయిస్టు పార్టీ ఎందుకు ఏర్పాటైంది? 2004లో కొన్ని కమ్యూనిస్టు గ్రూపులు ఏకమై మావోయిస్టు పార్టీ ఏర్పడింది. అయితే నక్సల్స్‌ను సమర్థించేవారికి మానవత్వమే లేదు. నక్సల్స్ లక్షలమంది తల్లులకు గర్భశోకం కలిగించారు' అని అమిత్? షా అన్నారు.

### అంతా కాంగ్రెస్ వల్లే!

'పేదలకు, పిల్లలకు ఆయుధాలు ఇచ్చినవారు మనుషులే కాదు. సల్వాజుడుం పేరుతో కాంగ్రెస్ పార్టీ అనేక దారుణాలు చేసింది. న్యాయమూర్తిగా పనిచేసిన సుదర్శనరెడ్డి తీర్పును ఖండిస్తున్నాం. జడ్జిలు తమ వ్యక్తిగత సిద్ధాంతాలను వృత్తిలో జోడించకూడదు. మేం వచ్చాక ఏజెన్సీ ప్రాంతాల్లో మొబైల్ టవర్లు నిర్మించాం. గిరిజన ప్రాంతాల్లో బ్యాంకులు, పోస్టాఫీసులు ఏర్పాటు చేశాం. ఏజెన్సీ ప్రాంతాల్లో ఏకలవ్య పాఠశాలలు, ఐటీఐలు, విద్యాలయాలు, ఆస్పత్రులు నిర్మించాం. ఏజెన్సీ ప్రాంతాల్లోని మౌలిక వసతుల కల్పనకు రూ.4 వేల కోట్లు ఖర్చు చేశాం' అని అమిత్? షా పేర్కొన్నారు.

# అసోంలో ఒకప్పుడు అస్థిరత, అశాంతి

అసోంలో ఒకప్పుడు దీర్ఘకాలం అస్థిరత, అశాంతి నెలకొన్నప్పటికీ, గత దశాబ్దంలో పరిస్థితులు పూర్తిగా మారిపోయాని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. రాష్ట్రంలో శాంతిని నెలకొల్పేందుకు బీజేపీ డబుల్ ఇంజిన్ ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రయత్నించిందని తెలిపారు. ఎన్నికల సమరానికి సిద్ధమవుతున్న అసోంలో 'మేరా బూత్ సబ్సే మజ్‌బూత్ సంవాద్' కార్యక్రమంలో భాగంగా బీజేపీ బూత్ స్థాయి కార్యకర్తలతో మాట్లాడుతూ మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. గతంలో హింసతో అల్లకల్లోలమైన అసోం ఇప్పుడు నూతన ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతోందని మోదీ అన్నారు. బీజేపీ డబుల్ ఇంజిన్ ప్రభుత్వం శాంతి స్థాపన కోసం కృషి చేయడంతో పరిస్థితులు మారాయని పేర్కొన్నారు. ఈశాన్య ప్రాంతంలో వివిధ సంస్థలతో 12 శాంతి ఒప్పందాలు కుదుర్చుకున్నామని తెలిపారు. ఒక రాష్ట్ర అభివృద్ధికి శాంతి అత్యవసరమని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. గత పదేళ్లలో నిజాయితీగా అమలు చేసిన శాంతి ఒప్పందాల వల్ల అసోంలో స్థిరత్వం నెలకొన్నట్లు చెప్పారు. యువత భవిష్యత్తు భద్రత కోసం బీజేపీ ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు.

### కాంగ్రెస్‌పై విమర్శలు

మునుపటి కాంగ్రెస్ ప్రభుత్వాలు కేవలం వార్తల్లో నిలిచేందుకు ఒప్పందాలు చేసేవని మోదీ విమర్శించారు. ఆ ఒప్పందాలు కాగితాలకే పరిమితమయ్యాయని, యువతను నిరాశలోకి నెట్టాయని అన్నారు. బోడో సమస్య సహా అనేక అంశాల్లో ప్రజలను కాంగ్రెస్ మోసం చేసిందని ఆరోపించారు. కాంగ్రెస్? పాలనలో తిరుగుబాటుదారులు, విద్యార్థి సంఘాలతో చేసుకున్న ఏ ఒప్పందమూ ఫలించలేదని విమర్శించారు.



### మొదటిసారి ఓటర్లకు పిలుపు

మొదటిసారి ఓటు వేయనున్న యువతకు గత కాంగ్రెస్ ప్రభుత్వాల దుష్పరిపాలన గురించి గుర్తు చేయాలని పార్టీ కార్యకర్తలకు ప్రధాని మోదీ సూచించారు. చిన్న తప్పిదం కూడా రాష్ట్రాన్ని మళ్లీ వెనక్కి నెడుతుందని హెచ్చరించారు. ఎన్నికల సమయంలో సోషల్ మీడియాలో ప్రచారం అవుతున్న ఏఐ రూపొందించిన వీడియోలపై ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. అలాగే అసోంలో ఈసారి కూడా హ్యాట్రిక్ విజయం లక్ష్యంగా పనిచేస్తున్నట్లు మోదీ తెలిపారు.

### బంగ్లాదేశ్ చొరబాటుదారులను అనుమతించింది కాంగ్రెస్ : నితిన్ నబీన్

కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు బంగ్లాదేశీయులను అసోంలోకి అక్రమంగా ప్రవేశించేందుకు సహకరించిందని బీజేపీ అధ్యక్షుడు నితిన్ నబీన్ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్న సమయంలో అక్రమ వలసలను నియంత్రించలేదని, దీంతో బంగ్లాదేశీ చొరబాటుదారులు అసోంలోకి పెద్ద ఎత్తున ప్రవేశించారని అన్నారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పరిస్థితిని మార్చి అక్రమ వలసదారులకు నిష్క్రమణ చూపిస్తున్నామని తెలిపారు. మోరిగావ్ జిల్లాలో ఎన్నికల ప్రచారంలో ప్రసంగిస్తూ ఈ మేరకు మాట్లాడారు.

### రాహుల్ గాంధీపై నబీన్ విమర్శలు

లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీపై కూడా నితిన్ నబీన్ విమర్శలు గుప్పించారు. దిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో అసోం సంప్రదాయ కండువా గమోచాను ధరించలేదని, ఇది రాష్ట్ర ప్రజల భావాలను దెబ్బతీసిందని అన్నారు. అదే సమయంలో మసీదులకు వెళ్లినప్పుడు టోపీ ధరిస్తారని ఆరోపించారు.

### 'బీజేపీ పాలనలో అభివృద్ధి'

గత పది సంవత్సరాల్లో బీజేపీ పాలనలో అసోంలో భారీ అభివృద్ధి జరిగిందని నబీన్ పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనలో తీవ్రవాదం, హింస, పెట్టుబడిదారుల వెనుదిగడం, యువత నిరాశ వంటి సమస్యలు ఉండేవని గుర్తు చేశారు. అలాంటి పరిస్థితులు మళ్లీ రాకుండా ప్రజలు జాగ్రత్తగా నిర్ణయం తీసుకోవాలని పిలుపునిచ్చారు.

### ఏప్రిల్ 9న అసోం అసెంబ్లీ ఎన్నికలు

అసోంలో 126 అసెంబ్లీ స్థానాలకు ఒకే దశలో ఏప్రిల్ 9న ఎన్నికలు జరగనున్నాయి. మే 4న ఓట్ల లెక్కింపు ఉంటుంది. 2016 నుంచి బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం అక్కడ అధికారంలో ఉంది. హ్యాట్రిక్ కోసం బీజేపీ ప్రయత్నిస్తుండగా, ఈసారి అసోంలో అధికారాన్ని చేపట్టాలని కాంగ్రెస్ విశ్వప్రయత్నాలు చేస్తోంది.

# బీజేపీ, ఎల్‌డీఎఫ్ కుమ్మక్కు వల్లే శబరిమలపై మోదీ మౌనం

ఎక్కడికి వెళ్లినా ఆలయాలు, మతం గురించే మాట్లాడే ప్రధాని మోదీ, పాలక్కడ్ ఎన్నికల ప్రసంగంలో శబరిమల అంశంపై మౌనం వహించడం సరికాదని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మండిపడ్డారు. ఈ ఎన్నికల్లో బీజేపీ, వామపక్ష ఎల్‌డీఎఫ్ కూటమి కలిసి పనిచేస్తున్నందు వల్లే ఇలా జరిగిందని ఆయన ఆరోపించారు. మతం కంటే రాజకీయాలకు ప్రాధాన్యతను ఇచ్చినందు వల్లే, శబరిమల అంశాన్ని ప్రసంగంలో మోదీ ప్రస్తావించలేదన్నారు. శబరిమలలో ఏం జరిగిందో మర్చిపోయినట్లుగా మోదీ వ్యవహరించారని రాహుల్ విమర్శించారు. అధికార వామపక్ష కూటమి నేతలు అయ్యప్ప ఆలయం బంగారాన్ని స్వాహా చేసి దాని స్థానంలో ఇత్తడిని పెట్టారనే విషయాన్ని ప్రధాని మర్చిపోయారని ఆయన వ్యాఖ్యానించారు. అయ్యప్ప ఆలయానికి నెలవైన పాలక్కడ్ జిల్లాకు వచ్చినప్పుడు శబరిమల గురించి మాట్లాడకపోవడం సరికాదన్నారు. యూడీఎఫ్ కూటమి అధికారంలోకి వస్తే అయ్యప్ప ఆలయంలో జరిగిన అక్రమాలతో సంబంధమున్న వారిపై చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. సోమవారం కేరళలోని పథనంతిట్ట జిల్లా అదూర్‌లో జరిగిన కాంగ్రెస్ ఎన్నికల ప్రచార ర్యాలీలో రాహుల్ గాంధీ ఈ వ్యాఖ్యలు చేశారు.

### ఎల్‌డీఎఫ్ కూటమిలో బీజేపీ రహస్య హస్తం

"ఈసారి కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ – సీపీఎంలతో కూడిన ద్వయాన్ని కాంగ్రెస్ పార్టీ ఎదుర్కొంటోంది. ఈదఫా బీజేపీ పూర్తి మద్దతును కలిగిన వామపక్ష ఎల్‌డీఎఫ్ కూటమితో మేం పోరాడుతున్నాం. ఒక వైపు కాంగ్రెస్ సారథ్యంలోని యూడీఎఫ్ కూటమి ఉంది. మరోవైపు సీపీఎం – బీజేపీల ద్వయం ఉంది. ఎల్‌డీఎఫ్ కూటమిలో బీజేపీ రహస్య హస్తం దాగి ఉంది. సాధారణంగా రహస్య హస్తం లాంటి కాన్సెప్ట్‌లను మార్కెట్లతో ముడిపడిన



ఆర్థికవేత్తలు వినియోగిస్తుంటారు. కేరళలో కాంగ్రెస్ అధికారంలోకి రాకూడదని బీజేపీ కోరుకుంటోంది. ఎందుకంటే జాతీయ స్థాయిలో బీజేపీకి సవాల్ విసురుతున్న ఏకైక రాజకీయ శక్తి కాంగ్రెస్ మాత్రమే. బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లతో మేం సైద్ధాంతికంగా పోరాడుతున్నాం. ఎల్‌డీఎఫ్ లాంటి కూటమి కేరళలో అధికారంలో ఉన్నా, తమ నియంత్రణలోనే పని చేస్తుందని బీజేపీ భావిస్తోంది. బీజేపీ నియంత్రణలో ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం ఉన్నందు వల్లే సీఎం పినరయి విజయన్‌పై ఒక్క కేసూ నమోదు కాలేదు. బీజేపీపై సీఎం పినరయి విజయన్ పల్లెత్తు మాట కూడా అనలేదు. బీజేపీ– ఎల్‌డీఎఫ్ కుమ్మక్కుకు ఇవే నిదర్శనాలు" అని రాహుల్ గాంధీ తెలిపారు.

### కేరళ సీఎంను ఎందుకు టార్గెట్ చేయడం లేదు?

"కేంద్ర దర్యాప్తు సంస్థలన్నీ దేశంలోని విపక్ష నేతలను లక్ష్యంగా చేసుకుంటున్నాయి. బీజేపీకి వ్యతిరేకంగా ఎవరు పోరాడినా దర్యాప్తు సంస్థల ఒత్తిడిని ఎదుర్కోవాల్సి వస్తోంది. అందుకే నాపైనా 36 కేసులను నమోదు చేశారు. నన్ను కంటిన్యూగా 55 గంటల పాటు ప్రశ్నించారు. కానీ కేరళలోని వామపక్ష ఎల్‌డీఎఫ్ కూటమి అధినాయకత్వంపై అలాంటి దర్యాప్తుల ఒత్తిడేం లేదు. కేరళ సీఎంను కానీ, అధికార ఎల్‌డీఎఫ్ కూటమి నేతలను కానీ కేంద్ర దర్యాప్తు సంస్థలు ఎందుకో టార్గెట్ చేయడం లేదు" అని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు.

### దేశాన్ని అదానీ, అంబానీల చేతుల్లో పెడుతున్నారు!

"నేను ఈ ప్రసంగాన్ని మొదలుపెట్టేటప్పుడే మైక్ వైపు చూశాను. ఇదిగో దానిపై మేడ్ ఇన్ చైనా అని రాసి ఉంది. ఇండియాలో తయారైంది, కేరళలో తయారైంది అని దీనిపై ఎందుకు రాసిలేదు? మేడ్ ఇన్ ఇండియా వస్తువుల తయారీ అనేది లేకుండా మనం కేరళ యువత కోసం ఉద్యోగ అవకాశాలను ఎలా క్రియేట్ చేయగలం? కేరళ భవిష్యత్తును కేవలం 1 లేదా 2 కంపెనీలే కంట్రోల్ చేస్తే, మేడిన్ ఇండియా లక్ష్యాన్ని మనం ఎలా సాకారం చేసుకోగలం? మీ ముఖ్యమంత్రి, ప్రధానమంత్రే ఈ దేశాన్ని అదానీ, అంబానీల చేతుల్లో పెడుతున్నారు. కేరళలోని వామపక్ష ప్రభుత్వమే కమ్యూనిస్టు భావజాలాన్ని అణచివేస్తోంది. దీంతో అది కార్పొరేట్ ఫండెడ్ ప్రభుత్వంగా మారిపోయింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ప్రధాని మోదీ రాజీకి వచ్చినట్టుగా, నరేంద్రమోదీతో సీఎం పినరయి విజయన్ రాజీకి వచ్చారు. అవినీతి అభియోగాల ద్వారా విజయన్‌ను మోదీ కంట్రోల్ చేస్తున్నారు" అని రాహుల్ గాంధీ ప్రశ్నలు సంధించారు.

## పేదల కోసం మరో 17 లక్షల ఇళ్లు.. 2029 నాటికి అందరికీ ఇస్తాం

-మొదటిపేజీ తరువాయి

సరఫరా చేస్తాం. ఉచిత సిలిండర్ కు ఇచ్చే డబ్బులు ప్రతీ రెండు నెలలకూ ప్రజలకు చెల్లిస్తాం. ఇప్పుడు పైపు ద్వారా నీళ్లు వచ్చినట్టే గ్యాస్ కూడా వస్తుంది. పైప్డ్ గ్యాస్ త్వరలోనే అందుబాటులోకి తెస్తాం. జల్ జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి తాగునీరు ఇవ్వాల్సి ఉన్నా గత పాలకులు దానిని నిర్వీర్యం చేశారు. ఇప్పుడు కేంద్రాన్ని ఒప్పించి 2028 వరకూ ఈ పథకం కొనసాగించేలా చేసి ప్రతీ ఇంటికీ కుళాయి ద్వారా నీరందిస్తాం. -- ప్రతీ ఇంటికి సౌర ఫలకాలు పెట్టుకుంటే ఉచిత విద్యుత్ వస్తుంది. పంపుసెట్ కు కూడా బిగించుకుంటే విద్యుత్ అంతా ఉచితంగా వస్తుంది. వీటన్నింటినీ వినియోగించుకోవడానికి ప్రజలు ముందుకు రావాలని విజ్ఞప్తి చేస్తున్నాను. వీధిదీపాలు, సీసీ రోడ్లు, డ్రైనేజి, ఇంటింటి నుంచి చెత్త సేకరణ లాంటి కార్యక్రమాలు చేస్తున్నాం. సూపర్ సిక్స్ పథకాలను సూపర్ హిట్ చేశాం. 63 లక్షల మంది పేదలకు పెన్షన్లు ఇస్తున్నాం. ఇప్పటి వరకూ గత పాలకులు మూడు ముక్కలాటతో రాజధానిని ముక్కలు చేశారు. అందుకే అమరావతికి చట్టబద్ధత కల్పించేలా కేంద్రాన్ని కోరుతూ అసెంబ్లీలో తీర్మానం చేశాం. ఇక్కడ అటానమస్ షిప్ యార్డు వస్తుంది. మత్స్యకారులకు అన్యాయం జరగదని హామీ ఇస్తున్నాం. స్థానిక జాలర్లకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని, పొరుగు రాష్ట్రాల జాలర్లు చేపల వేటకు రానివ్వకుండా కట్టడి చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. నెల్లూరు తీర ప్రాంతానికి ప్రత్యేకంగా రెండు గస్తీ బోట్లను మంజూరు చేస్తున్నట్టు ప్రకటించారు. స్థానిక మత్స్యకారులకు నష్టం వాటిల్లకుండా చూడాల్సిన బాధ్యతను నెల్లూరు, తిరుపతి కలెక్టర్లకు అప్పగించారు. సుపరిపాలన, సమర్థవంతమైన పాలన ఇవ్వాలనే అనునిత్యం పనిచేస్తున్నాం. ఉద్యోగులకు మొదటి తేదీనే జీతాలు వచ్చేలా వ్యవస్థను గాడిలో పెట్టాం. అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి పాలనను ముందుకు తీసుకెళ్లాలి. పెన్షన్ తో పాటు వివిధ సంక్షేమ కార్యక్రమాల అమలులో ఉద్యోగులు ఎలా వ్యవహరిస్తున్నారో కూడా తనిఖీ చేస్తున్నాం. వివిధ రకాల పౌరసేవల్ని అందించటంలో చక్కగా పనిచేస్తున్న ఉద్యోగులందరికీ అభినందనలు తెలియచేస్తున్నాను.

## సైనికులకు న్యాయం సులభంగా అందాలి

దేశ సైనికుల గురించి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ కీలక వ్యాఖ్యలు చేశారు. సైనికులను వారి చట్టపరమైన హక్కుల కోసం సరిహద్దుల్లో ఒకటి, స్వదేశంలో మరొకటి, ఇలా ఒకేసారి రెండు యుద్ధాలు చేసేలా దేశం బలవంతం చేయకూడదని అన్నారు. సైనికులకు మెరుగైన న్యాయ సదుపాయం కల్పించాలని ఆయన పిలుపునిచ్చారు. కేంద్రపాలిత ప్రాంతం లేహ్ జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న సీజేఐ సూర్యకాంత్ ఈ మేరకు వ్యాఖ్యానించారు. న్యాయవ్యవస్థకు, సాయుధ దళాలకు మధ్య ఉన్న పరస్పర సహకార సంబంధాన్ని సీజేఐ సూర్యకాంత్ ప్రముఖంగా ప్రస్తావించారు. న్యాయస్థానాలు రాజ్యాంగ విలువలను కాపాడుతుండగా, ఆ ఆదర్శాలు నిలబడటానికి అవసరమైన పరిస్థితులను సైనికులే సృష్టిస్తారని పేర్కొన్నారు. అలాగే 1962 నాటి రెజాంగ్ లా యుద్ధాన్ని సైతం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ప్రస్తావించారు. మేజర్ శైతాన్ సింగ్ భాటి, 13 కుమావోన్ రెజిమెంట్‌కు చెందిన చార్లీ కంపెనీలోని 114 మంది సైనికుల త్యాగాన్ని ఆయన గుర్తుచేసుకున్నారు. "రాజ్యాంగం హక్కులు, గౌరవం, సమానత్వం, న్యాయం గురించి మాట్లాడినప్పటికీ, దేశ ప్రజల కోసం ఆ వాగ్దానాలు నిలబడగలిగే పరిస్థితులను కల్పించిన పూర్తి ఘనత సైనికులకే దక్కుతుంది. ఒక దేశం తన సార్వభౌమత్వాన్ని, స్థిరత్వాన్ని, శాంతిని కాపాడుకోలేకపోతే, ఆ దేశం స్వేచ్ఛ, న్యాయం గురించి అర్థవంతంగా మాట్లాడలేదు. సైనికుల భూ వివాదాన్ని కూడా ఎదుర్కోవచ్చు. ఒక మాజీ సైనికుడు సర్వీసు లేదా సంక్షేమ హక్కుల కోసం ఇబ్బందులు పడొచ్చు. ఒక కుటుంబం పింఛనుకు సంబంధించిన జాప్యాలు, గృహ సమస్యలు, వైవాహిక కలహాలు సంబంధిత వ్యవహారాల్లో అధికార యంత్రాంగం ఉదాసీనతతో వ్యవహరించొచ్చు. దేశం తన సైనికులను ఒకేసారి రెండు యుద్ధాలు చేసే స్థితిలో ఎన్నడూ ఉంచకూడదు. చట్టం సైనికుడి వద్దకే వెళ్లాలి. ఎందుకంటే సైనికుడు ఎల్లప్పుడూ చట్టం వద్దకు వెళ్లలేడు. సైనికులకు న్యాయం సులభంగా అందాలి" అని సీజేఐ సూర్యకాంత్ వ్యాఖ్యానించారు.

### 'దేశాన్ని కాపాడేవారికి న్యాయ సహాయం అందించాలి'

ఇది కేవలం సైనికుల సానుభూతికి సంబంధించిన విషయం మాత్రమే కాదని, ఒక రాజ్యాంగ విధి అని సీజేఐ సూర్యకాంత్ అభిప్రాయపడ్డారు. దేశ సమగ్రతను కాపాడే వారికి ప్రభుత్వ సంస్థలు సకాలంలో న్యాయ సహాయం అందించాలని పేర్కొన్నారు. అలా చేయలేకపోతే ప్రభుత్వ సంస్థలు తమ నైతిక, రాజ్యాంగ బాధ్యతలను నిర్వర్తించడంలో విఫలమైనట్లేనని అభిప్రాయపడ్డారు. తాను నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (చీూూూూ) కార్యనిర్వాహక అధిపతిగా ఉన్నప్పుడు రక్షణ సిబ్బంది, మాజీ సైనికులు, వారి కుటుంబ సభ్యులు, పారామిలిటరీ దళాలు, సీఏపీఎఫ్ సభ్యులకు ఉచిత న్యాయ సహాయం, తోడ్పాటు, మద్దతు సేవలను అందించడానికి ప్రారంభించిన 'వీర్ పరివార్ సహాయ యోజన'ను ఈ సందర్భంగా సీజేఐ ప్రస్తావించారు. నల్సా కార్యనిర్వాహక ఛైర్మన్‌గా తాను ఉన్నప్పుడు సాయుధ దళాల కోసం ఈ పథకాన్ని రూపొందించి, అమలు చేయడం తన కెరీర్‌లోని గొప్ప ఘట్టాలలో ఒకటని అన్నారు. ఇప్పటివరకు దేశవ్యాప్తంగా 14,929 మంది లబ్ధిదారులకు సహాయం అందించామని, 34 రాజ్య సైనిక్ బోర్డులు, 404 జిల్లా సైనిక్ బోర్డులతో సహా 438 న్యాయ సేవల క్లినిక్‌లను కార్యాచరణలోకి తెచ్చామని వెల్లడించారు. 'వీర్ పరివార్ సహాయ యోజన' కింద సేవలందించేందుకు విశ్వాసం, సానుభూతి సంస్కృతిని పెంపొందించేందుకు రక్షణ రంగ నేపథ్యం ఉన్న 378 మందితో సహా మొత్తం 1,123 మంది సిబ్బందిని నియమించినట్లు సీజేఐ సూర్యకాంత్ తెలిపారు. ఈ పథకం కింద ఆస్తి వివాదాలు, పెన్షన్ ఆలస్యం మొదలుకొని వైవాహిక కలహాలు, పాఠశాల ప్రవేశాల వరకు పలు సమస్యలను పరిష్కరించడం జరిగిందని చెప్పారు. సైనికులు సరిహద్దుల్లో ఉండి దేశాన్ని కాపాడుతున్నారని కొనియాడారు. సైనికుల ప్రయోజనాలన్నింటినీ పట్టుదలతో కాపాడటం దేశ సంస్థల కర్తవ్యమని అభిప్రాయపడ్డారు.

## ఏప్రిల్ 1 నుంచి జనగణన

దేశవ్యాప్తంగా ఏప్రిల్ 1 నుంచి జనగణన–2027 ప్రక్రియ మొదటి దశ ప్రారంభం కానుంది. ఇందులో భాగంగా ఎన్యుమరేటర్లు ఇంటింటికి వెళ్లి ప్రత్యేక మొబైల్ యాప్ ద్వారా హౌజ్ లిస్టింగ్ – హౌజింగ్ సెన్సస్ (నూూ)ను నిర్వహించనున్నారు. వివాహం చేసుకోకుండా చాలాకాలంగా కలిసి ఉంటున్న జంటలను ఇకపై ఒకే కుటుంబంగా గుర్తించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. సహ జీవన జంటలను పెళ్లయిన దంపతులలాగే పరిగణించాలని డిసైడ్ చేసింది. ఈ మేరకు జనగణన నిబంధనల్లో కీలక మార్పులు చేశారు. తొలిసారిగా ప్రజలకు స్వయంగా తమ వివరాలను సెల్ఫ్ ఎన్యుమరేషన్ పోర్టల్‌లో నమోదు చేసుకునే అవకాశాన్ని ఇచ్చారు. ఈ క్రమంలో ప్రజల సందేహాలను తీర్చేందుకు తరుచుగా అడిగే 33 ప్రశ్నల సమాధానాలను ఆ పోర్టల్‌లో రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా(ఆర్‌జీఐ) పొందుపర్చింది. హౌజ్ లిస్టింగ్ – హౌజింగ్ సెన్సస్ సందర్భంగా ఈ 33 ప్రశ్నలనే ప్రజలను ఎన్యుమరేటర్లు అడగనున్నారు.

### జనగణనలో ప్రజలిచ్చే సమాచారాన్ని ఎవ్వరికీ ఇవ్వం : ఆర్‌జీఐ

ఈ సందర్భంగా సోమవారం రోజు విలేకరుల సమావేశంలో రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా మృత్యుంజయ్ కుమార్ నారాయణ్ కీలక వివరాలను వెల్లడించారు. జనగణన చట్టం (సెన్సస్ యాక్ట్)లోని సెక్షన్ –15 అనేది అత్యంత కీలకమైందని, దీని ప్రకారం జనగణన వేళ ప్రజలు అందించే సమాచారాన్ని విశ్వసనీయమైనదిగా పరిగణిస్తామని ఆయన తెలిపారు. చివరకు సమాచార హక్కు చట్టం (ఆర్‌టీఐ) కింద కూడా ఆ సమాచారాన్ని తాము బహిర్గతపర్చమని స్పష్టం చేశారు. కోర్టులో రుజువుగానూ ఆ సమాచారాన్ని అందించమని, ఏ ఇతర సంస్థకూ ఈ వివరాలను అందించమని మృత్యుంజయ్ తేల్చి చెప్పారు. జనగణన ప్రక్రియలో రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు కీలక పాత్ర పోషిస్తాయని ఆయన అన్నారు. క్షేత్రస్థాయిలో జనగణనను నిర్వహించేందుకు యావత్ పాలనా యంత్రాంగాన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు వినియోగిస్తాయని పేర్కొన్నారు. చివరిసారిగా మన దేశంలో 2011లో జనగణన జరిగిందని, ఇది భారత్‌కు స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత జరుగుతున్న 8వ జనగణన అని మృత్యుంజయ్ చెప్పారు.

# తెలుగు రాష్ట్రాల్లో వేల కోట్లతో విద్యా పథకాలు

**– ఎంపీ కేశినేని శివనాథ్ ప్రశ్నకు లోక్‌సభలో కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి జయంత్ చౌదరి సమాధానం**

**అంకుశం ప్రతినిధి న్యూఢిల్లీ : మార్చి 30 :**దేశంలోని షెడ్యూల్డ్ కులాల (ఎస్సీ) విద్యార్థుల విద్యాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి జయంత్ చౌదరి తెలిపారు. 'సమగ్ర శిక్ష', 'పీఎం శ్రీ' వంటి పథకాల ద్వారా దళిత విద్యార్థుల సంక్షేమానికి భారీగా నిధులు వెచ్చిస్తోందని వివరించారు. ఎస్సీ విద్యార్థులకు విద్యాపరంగా అమలు జరుగుతున్న పథకాల వివరాలు తెలిపాలంటూ లోక్‌సభలో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ తో పాటుగా పలువురు ఎంపీలు సోమవారం అడిగిన ప్రశ్నకు మంత్రి లిఖిత పూర్వక సమాధానంను కేంద్ర ప్రభుత్వం తరుపున ఇచ్చారు.



ఎస్సీ విద్యార్థుల సంక్షేమం కోసం అమలవుతున్న అభివృద్ధి ప్రణాళిక (డీఏపీఎస్సీ) ప్రకారం.. విద్యాభివృద్ధికి కేటాయించిన మొత్తం వ్యయంలో కనీసం 20 శాతాన్ని ఎస్సీ విద్యార్థుల కోసమే ఖర్చు చేయాలని కేంద్రం స్పష్టం చేసిందన్నారు. గత కొన్నేళ్లుగా ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్సీ విద్యార్థుల నమోదు సగటున 22 శాతానికి పైగా ఉందని, అదే నిష్పత్తిలో నిధుల వ్యయం జరుగుతోందని మంత్రి వివరించారు . 2024-25 విద్యా సంవత్సరంలో దేశవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో దాదాపు 2.77 కోట్ల మంది ఎస్సీ విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నట్లు తెలిపారు. ప్రీ-స్కూల్ నుంచి 12వ తరగతి వరకు విద్యార్థులందరికీ సమాన విద్యావకాశాలు కల్పించడమే లక్ష్యంగా 'సమగ్ర శిక్ష' పథకాన్ని అమలు చేస్తున్నారన్నారు. జాతీయ విద్యా విధానం - 2020 లో భాగంగా ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వంటి వెనుకబడిన వర్గాలకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారన్నారు.

సమగ్ర శిక్ష అభియాన్ నిధులు దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతలకు కలిపి 2025- 26 సంవత్సరానికి గానూ రు.46744.23 కోట్లు మంజూరు కాగా రు.18.220.96 కోట్ల నిధులు విడుదల అయ్యాయని తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లో అమలు విషయానికి వస్తే ఆంధ్రప్రదేశ్ కు సంబంధించి సమగ్ర శిక్ష కింద రూ. 1,732.93 కోట్లు మంజూరు కాగా, రూ. 1,240.11 కోట్లు విడుదలయ్యాయని , ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పాఠశాలల్లో 9,93,320 మంది ఎస్సీ విద్యార్థులు ఉన్నారని వివరించారు. అదే రీతిలో తెలంగాణాలో ఈ పథకం కింద రూ. 1,162.72 కోట్లు మంజూరు చేయగా , రూ. 988.79 కోట్లు విడుదల చేశారన్నారు. తెలంగాణా రాష్ట్రంలో 6,52,066 మంది ఎస్సీ విద్యార్థులు నమోదు చేసుకున్నారని తెలిపారు.

**పీఎం శ్రీ పథకంతో నూతన వెలుగులు**

ప్రభుత్వ పాఠశాలలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు 2022 సెప్టెంబరులో 'పీఎం శ్రీ' పథకాన్ని కేంద్రం ప్రారంభించిందని మంత్రి జయంత్ చౌదరి తెలిపారు.

# పిటిషన్లకు చట్టపదిలో పరిష్కారం చూడండి

**– పోలీస్ కార్యాలయం 98 పిటీషన్లు**

**– జిల్లా ఎస్పీ పి.జగదీష్**

**అంకుశం క్రైమ్ న్యూస్ అనంతపురం మార్చి 30 :**అనంతపురం జిల్లా ప్రజల నుంచి జిల్లా పోలీస్ శాఖ నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే ఫిర్యాదులను చట్టపరిధిలో వెంటనే పరిష్కారం చూపాలని





అనంతపురం జిల్లా ఎస్పీ పి. జగదీష్ పోలీస్ అధికారులకు ఆదేశించారు ఈరోజు స్థానిక పోలీస్ కాన్ఫరెన్స్ హాల్లో పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసల్ సిస్టమ్ (PGRS) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ జగదీష్ ప్రజల నుండి వివిధ సమస్యలపై 98 అర్జీలను స్వీకరించారు. ప్రజల సమస్యలను శ్రద్ధగా విని, వాటిని తక్షణమే పరిశీలించి చట్టపరిధిలో పరిష్కరించేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా...ఈ కార్యక్రమానికి హాజరైన పిటిషనర్లు మరియు వారి వెంట వచ్చిన వారికి ఇస్కాన్ సంస్థ వారి సహకారంతో ఉచిత భోజన ఏర్పాట్లు చేయడం జరిగింది. పోలీసు అధికారులు పాల్గొని స్వయంగా వారే భోజనం వడ్డించారు. ఈ సందర్భంగా ప్రజలు జిల్లా పోలీస్ యంత్రాంగానికి మరియు ఇస్కాన్ సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ పిజిఆర్ఎస్ కార్యక్రమంలో అనంతపురం అర్బన్ డీఎస్పీ వి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

# అర్జీలను వేగవంతంగా పరిష్కరించాలి

**– : జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్**

**అంకుశం న్యూస్ అనంతపురం, మార్చి 30 :** అనంతపురం కలెక్టరేట్ లోని రెవెన్యూ భవనంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసెల్ సిస్టం, పిజిఆర్ఎస్), రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం నిర్వహించగా, ఇందులో భాగంగా జిల్లాలోని ఆయా మండలాల నుంచి వివిధ రకాల సమస్యలతో వచ్చిన అర్జీదారుల నుండి జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ అర్జీలను స్వీకరించారు.

జాయింట్ కలెక్టర్ తో పాటు అర్జీలను స్వీకరించే కార్యక్రమంలో డిఆర్ఓ ఏ.మలోల, జిల్లా ఫారెస్ట్ సెటిల్మెంట్ అధికారి జి.రామకృష్ణారెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఆనంద్, పద్మావతి, ఆయా శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి 461 అర్జీలను జాయింట్ కలెక్టర్ స్వీకరించారు.



– ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ క్లినిక్ ల అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. అర్జీలను వేగవంతంగా, నాణ్యతగా పరిష్కరించాలన్నారు. ఎలాంటి పెండింగ్ లేకుండా అర్జీలను పరిష్కరించాలని, గ్రీవెన్స్ పై ఎప్పటికప్పుడు మానిటర్ చేయాలని, ఇందులో ఎలాంటి అలసత్వం ఉండరాదన్నారు. సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. అర్జీలను గడువులోపు అత్యంత నాణ్యతగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

– ఈ కార్యక్రమంలో ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ సురేష్, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ శేషాద్రి శేఖర్, డిపిఓ నాగరాజునాయుడు, జడ్పి సిఈఓ శివశంకర్, జిల్లా వ్యవసాయ అధికారి రవి, డిఎంహెచ్ఓ డా.ఈబి.దేవి, బీసీ వెల్ఫేర్ డిడి ఖుష్బూ కొఠారి, సమగ్ర శిక్ష ఏపిసి శైలజ, డిసిఓ అరుణకుమారి, హార్టికల్చర్ డిడి ఉమాదేవి, ఐసిడిఎస్ పిడి శ్రీదేవి, డిఎండబ్ల్యుఓ రామసుబ్బారెడ్డి, డిటిసి వీర్రాజు, ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా కోఆర్డినేటర్ గంగాధర్ రెడ్డి, జిల్లా టూరిజం అధికారి జయ కుమార్ బాబు, ఆర్.అండ్.బి ఎస్ఈ మురళీకృష్ణ, వయోజన విద్య ఉపసంచాలకులు వెంకటేశ్వర్లు, ఆర్.అండ్.బి ఎస్ఈ మురళీకృష్ణ, హెచ్.ఎల్.సి ఎస్ఈ సుధాకర్ రావు, ఎల్డియం నరేష్ రెడ్డి, జిల్లా పరిశ్రమల శాఖ ఏడి రాజశేఖర్ రెడ్డి, కలెక్టరేట్ సెక్షన్ సూపరింటెండెంట్లు రియాజుద్దీన్, వసంతలత, యుగేశ్వరిదేవి, కలెక్టరేట్ ఏఓ అలెగ్జాండర్, ఆయా శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి కళ్యాణం

**అధికారులకు మంత్రి సవిత పిలుపు**

**అంకుశం న్యూస్ కడప మార్చి 30:** ఒంటిమిట్టలోని శ్రీ కోదండరామస్వామి వారి కళ్యాణోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమిష్టిగా కృషి చేయాలని కడప జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి శ్రీమతి సవిత






పిలుపునిచ్చారు .ఒంటిమిట్టలోని టీటీడీ సమావేశ మందిరంలో సోమవారం మధ్యాహ్నం ఆమె జిల్లా మరియు టీటీడీ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏప్రిల్ 1న రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు దంపతులు శ్రీ కోదండరామస్వామి వారి కళ్యాణోత్సవం సందర్భంగా సమర్పించే పట్టు వస్త్రాల కార్యక్రమానికి సంబంధించి జరుగుతున్న ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో మురళీకృష్ణ ఏర్పాట్ల వివరాలను మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీమతి సవిత మాట్లాడుతూ గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని కళ్యాణోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా క్షేత్రస్థాయిలో అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.
ఈ సమావేశంలో టీటీడీ, జిల్లా మరియు పోలీసు శాఖల అధికారులు పాల్గొన్నారు.

# చప్పిడి చిన మాల కొండయ్య ను పరామర్శించిన దారపనేని



**కనిగిరి మార్చి అంకుశం న్యూస్ :** కనిగిరి నియోజకవర్గం పామూరు మండలంలోని మోపాడు గ్రామ వాస్తవ్యులు చప్పిడి చిన మాల కొండయ్య ను కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ పరామర్శించారు. కనిగిరి మాజీ శాసనసభ్యులు కీర్తిశేషులు దివంగత ఇరిగినేని తిరుపతి నాయుడుకు అత్యంత సన్నిహితులైన చప్పిడి చిన్న మాల కొండయ్య అనారోగ్యంతో అస్వస్థత కు గురికావడంతో కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని సలహా, సూచనతో విజయవాడ, బెంగుళూరు లోని కార్పొరేట్ హాస్పిటల్స్ లో మెరుగైన వైద్యం చేయించుకుని స్వగ్రామం మోపాడు లోని చిన మాలకొండయ్య స్వగృహంలో దారపనేని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యంపై అశ్రద్ధ విడనాడి ఆరోగ్యవంతులుగా ఉండేందుకు కృషి చేయాలని సూచించారు. మాజీ ఎంపీటీసీ చప్పిడి రామయ్య, మోపాడు గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మోరుబోయిన గిడ్డయ్య యాదవ్ ,నుచ్చుపొద తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, ఫిషర్మెన్ కమిటీ మాజీ అధ్యక్షులు కొలూరి ఖాజా రంతుల్లా, చప్పిడి కొండలరావు తదితరులు చిన మాలకొండయ్యను పరామర్శించిన వారిలో ఉన్నారు.

# ప్రజల సమస్యలను నాణ్యతగా పరిష్కరించాలి

**జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్**

**అంకుశం న్యూస్ పుట్టపర్తి, మార్చి 30:** పిజిఆర్ఎస్ కార్యక్రమం ద్వారా స్వీకరించిన అర్జీలను ప్రజల సంతృప్తి స్థాయి పెరిగేలా త్వరితగతిన నాణ్యతగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ లి అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలు నందు... ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.మౌర్య భరద్వాజ్, డిఆర్వో విజయసారధి,ఆర్డీఓ సువర్ణ ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు.



ఈ సందర్భంగా కలెక్టర్ శ్యాం ప్రసాద్ మాట్లాడుతూ.... పిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు .. క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. అర్జీదారుడు సంతృప్తిచెందేలా నిర్ణీత గడువులోపు అర్జీలను తప్పనిసరిగా పరిష్కరించాలని ఆదేశించారు. పెండింగ్ దరఖాస్తులు, బియాండ్ ఎస్ఎల్ఏ, రీఓపెనింగ్.. లేకుండా అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలన్నారు. అనంతరం అర్జీదారులనుండి వారు అర్జీలను స్వీకరించారు.

# పీ-4 దేశానికే ఆదర్శం





**– మార్గదర్శులను ఘనంగా సత్కారించిన ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్**

**అంకుశం న్యూస్ అనంతపురం మార్చి 30:** ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎంతో దూర దృష్టితో చేపట్టిన పీ-4 కార్యక్రమం.. నేడు దేశంలోని అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా మారిందని అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. పీ-4 కార్యక్రమానికి సంవత్సరం పూర్తైన సందర్భంగా స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బంగారు కుటుంబాలు, మార్గదర్శులతో ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఇక్కడ ఇరువురితోనూ పరస్పర సంభాషణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం మార్గదర్శి కుటుంబాలను ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఘనంగా సత్కరించారు. వారిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలామంది పేదరికంతో ఇబ్బంది పడుతున్నారని.. ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడి ఉన్నారన్నారు. ఇలాంటి వారిని అందరితోపాటు ముందుకు నడిపించే విధంగా దత్తతు తీసుకునేలా పీ-4 కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు. పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలు అలాగే ఉద్యోగులు ఇలా అందర్నీ ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం చేస్తూ సేవా కార్యక్రమాల వైపు నడిపించారన్నారు. ఈ విధంగా ఏడాది క్రితం ప్రారంభమైన ఈ కార్యక్రమం ద్వారా ఎంతో మందికి లబ్ధి చేకూరుతోందన్నారు. తన కూతురు దగ్గుపాటి అశ్రిత కూడా 25 కుటుంబాలను దత్తత తీసుకున్నారన్నారు. అలాగే అనంతపురం నగరంలో ఎస్ఈ రాజశేఖర్ 150 కుటుంబాలను, టీడీపీ నేత ఓంకార్ రెడ్డి పీ4 కింద 99కుటుంబాలను దత్తతు తీసుకున్నారన్నారు. శాప్ డైరెక్టర్ బొమ్మినేని శివ పీ-4 కింద 15లక్షలతో 250 సైకిళ్లను విద్యార్థులకు అందజేయడం అభినందనీయమన్నారు. జిల్లా వ్యాప్తంగా ఎంతో మంది అధికారులు ఉన్నారని వారందర్నీ ఇందులో భాగస్వామ్యం చేసినట్లు చెప్పారు. వారు ఎంత బిజీగా ఉన్నప్పటికీ కూడా... తమకు వచ్చిన వేతనంలో కొంతవరకు పేద కుటుంబాల కోసం ఖర్చు చేసి.. వారిని ఉన్నత స్థానానికి తీసుకొచ్చే విధంగా ప్రోత్సహిస్తున్నారన్నారు. పేదరికంలో ఉన్నవారికి ఆర్థికంగా సాయం చేయడం ఈ కార్యక్రమం ఉద్దేశం కాదని.. వారికి ఇళ్లు, చదువులు, ఉద్యోగం వంటివి అందించి అన్ని వర్గాలతో సమానంగా తీసుకురావడమే ఈ కార్యక్రమం యొక్క ప్రధాన ఉద్దేశమన్నారు. 2047కి పేదరికం అన్నదే లేకుండా చేయాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమని... అందుకనుగుణంగా అడుగులు పడుతున్నాయని ఎమ్మెల్యే దగ్గుపాటి అన్నారు. అనంతపురం జిల్లా వంటి కరవు ప్రాంతంలో పేదరికంతో బాధపడుతున్న కుటుంబాలను దత్తత తీసుకునేందుకు మరికొంత మంది ముందుకు రావాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ జస్వంత్ కుమార్, టిడిపి నగర అధ్యక్షుడు సుధాకర్ యాదవ్, డైరెక్టర్లు పి ఎల్ ఎన్ మూర్తి, పరమేశ్వర్, బొమ్మినేని శివ, కడియాల కొండన్న, బెస్ట్ పవన్ కుమార్, టిడిపి నాయకులు కాయగూరల శ్రీధర్, ఓంకార్ రెడ్డి, సాకే లక్ష్మీనరసింహ, గోళ్ళ సుధాకర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# శమీ నారాయణ స్వామి ఆలయం లో శ్రీ రామ సప్తాహ కమిటీ భజనలు ఆధ్యాత్మిక కార్యక్రమం...

**అంకుశం న్యూస్ ధర్మవరం మార్చి 30:** ధర్మవరం నేసేపేట శమీ నారాయణ స్వామి ఆలయం లో నిర్వహిస్తున్న శ్రీ రామ సప్తాహశీ కార్యక్రమం ఏప్రిల్ నెల 4 వతేది వరకూ జరుగుతుందని నిర్వాహకులు పల్లెం వేణుగోపాల్ తెలియజేసారు. 5 వతేది ఆలయం లో అన్న ప్రసాదం కార్యక్రమం ఏర్పాటు చేశారు.గజ నాణ్య పట్టు సాలె సంఘం గజానాణ్య యువజన సంఘం గజానాణ్య పట్టు సాలె మహిళా సంఘం మహిళలు శ్రీ రామ నామ భజనలు నిర్వహించడం విశేషం. ఈ కార్యక్రమం విజయవంతం చేయాలని గిర్రాజు నాగేష్ జి. ప్రసాద్ కోటం రవి,పల్లెం కృష్ణ కోటం సుశీల తదితరులు పిలుపు నిచ్చారు



# ఏప్రిల్ 1 మంత్రి సత్య కుమార్ పుట్టపర్తి, ధర్మవరం పర్యటన

**అంకుశం న్యూస్ ధర్మవరం మార్చి 30 :** రాష్ట్ర ఆరోగ్యశాఖ గౌరవ మంత్రివర్యులు శ్రీ సత్య కుమార్ యాదవ్ పుట్టపర్తి మరియు ధర్మవరం పర్యటన వివరాలు:--ఏప్రిల్ 01 (బుధవారం):-- ఉదయం 10:00 గంటలకు పుట్టపర్తి కలెక్టరేట్, పి.జి.ఆర్.ఎస్ హాల్ నందు ఏర్పాటుచేసిన జిల్లా సమీక్షా కమిటీ సమావేశంలో (డిస్టిక్ రివ్యూ కమిటీ మీటింగ్) పాల్గొంటారు. మధ్యాహ్నం 2:00 గంటల నుండి సాయంత్రం 5:00 గంటల వరకు ధర్మవరం ఎన్డీఏ కార్యాలయంలో అందరికీ అందుబాటులో ఉంటారని ధర్మవరం బీజేపీ కార్యాలయం వారు తెలిపారు.



# చేనేత రంగం టీడీపీ సీనియర్ నేతలకు పల్లెం కృష్ణ సత్కారం!

**అంకుశం న్యూస్ ధర్మవరం మార్చి 30:** ధర్మవరం చేనేత టీడీపీ నాయకులు 15 వార్డు కు చెందిన చేనేత రంగం నాయకులు పల్లెం కృష్ణ ఆధ్వర్యంలో నేసే పేటలో ఘనంగా ఈ వేడుకలు నిర్వహించడం విశేషం. ఈ వేడుకలు అత్యంత వైభవంగా జరిపారు టీడీపీ పార్టీ కోసం సేవలు అందించిన వారిని సన్మానించారు.ఈ సందర్భంగా పల్లెం కృష్ణ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవశీ సందర్భంగాసీనియర్ చేనేత టీడీపీ నాయకులను పల్లెం కృష్ణ ఘనంగా సన్మానించారు.ధర్మవరం నియోజకవర్గం టీడీపీ ఇంచార అలనాడు డా యన్ టి ఆర్ స్థాపించిన తెలుగుదేశం పార్టీ ఈనాడు ఎంతో అభ్యున్నతి సాధించిన దని ఆయన అన్నారు.అందుకు కారణం విజన్ వున్న నాయకులు మన రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు, నారా లోకేష్ లను మరువలేమన్నారు.కాగా ఈ వేడుకలు ఒక వార్డులో 15 వార్డులో జరగడం ఇదే ప్రధమం. గా భావిస్తున్నారు



# ప్రజా సమస్యల రెవిన్యూ క్లినిక్ విజయవంతం

**అంకుశం న్యూస్ ధర్మవరం మార్చి 30:** ధర్మవరంలోని ఆర్డీవో కార్యాలయంలో సోమవారం రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం నిర్వహించబడింది. డివిజన్ పరిధిలోని ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొని వివిధ సమస్యలకు సంబంధించిన మొత్తం 4 వినతిపత్రాలను సమర్పించారు. అందులో 2 వినతిపత్రాలు మున్సిపాలిటీకి సంబంధించినవిగా, మిగతా 2 వినతిపత్రాలు రెవెన్యూ శాఖకు సంబంధించినవిగా అధికారులు తెలిపారు.



ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ప్రజల నుండి అందిన ప్రతి వినతిని ప్రాధాన్యతతో పరిగణించి సంబంధిత శాఖల ద్వారా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు పారదర్శకంగా, సమర్థవంతంగా మరియు వేగవంతంగా అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

స్వీకరించిన వినతులను సంబంధిత శాఖలకు పంపించి, వాటి పరిష్కారంపై పర్యవేక్షణ కొనసాగిస్తామని అధికారులు తెలిపారు. ప్రజలు తమ సమస్యలను ఇలాంటి కార్యక్రమాల ద్వారా తెలియజేసి పరిష్కారం పొందాలని సూచించారు.

# పేదవాడి ఇంటి కలను నిజం చేసాం

- పుట్టపర్తి ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి.
- పుట్టపర్తిలో గృహ ప్రవేశ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి, జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్,మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి.





**అంకుశం ప్రతినిధి పుట్టపర్తి మార్చి:30:** పేదవాడి ఇంటికలను నిజం చేస్తామని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు. పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని సాయి నగర్ మూడో వార్డులో ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా రూ.2.5 లక్షలతో యశోద ,వెంకటేష్ ,నాగమ్మ , వెంకట రాముడు నిర్మించిన గృహాలను పుట్టపర్తి ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి తో పాటు జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ ,మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి చేతుల మీదుగా సోమవారం గృహ ప్రవేశ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా గృహప్రవేశ కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారులకు పసుపు కుంకుమ నూతన వస్త్రాలు, పూలు ,పండ్లు ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ పుట్టపర్తి నియోజకవర్గం లో ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా పుట్టపర్తి మున్సిపాలిటీ పట్టణ గృహ నిర్మాణానికి రూ.4 కోట్లతో 161 మందికి ఇండ్లు మంజూరు అయినట్లు తెలిపారు. ఇందులో నిర్మాణం పూర్తి చేసుకున్న గృహాలను ప్రారంభించినట్లు తెలిపారు. ఇప్పటికే రాష్ట్రంలో 2లక్షల 50 వేల 893 లక్షల ఇళ్లను లబ్ధిదారులకు కూటమి ప్రభుత్వం లో మంజూరు చేసినట్లు తెలిపారు. ఇల్లు లేని ప్రతి ఒక్కరికి ఇంటికలను నిజం చేస్తామని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రంలో ఇల్లు లేని వారందరికీ ఇల్లు మంజూరు చేస్తామన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఏ ఒక్కరికి గృహాలు మంజూరు చేయలేదని విమర్శించారు. వైసీపీ ప్రభుత్వ హయంలో ఒక ఇల్లు కూడా నిర్మించలేదని ప్రభుత్వ నిధులు మాత్రం ఎవరి ఖాతాలోకి వెళ్ళాయో ఎవరికి తెలియడం లేదన్నారు. గత ప్రభుత్వంలో కోట్లాది రూపాయలు ఖర్చు చేశారని రాష్ట్రానికి చేసిన అభివృద్ధి శూన్యం అన్నారు. చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఇళ్లు లేని పేదలందరికీ ఇంటి కలను నిజం చేసి తీరుతామని పేర్కొన్నా కూటమి పార్టీల నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సంక్షేమం కోసం రాజీలేని పోరాటం







- జర్నలిస్టులు ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయొద్దు
- మచ్చా రామలింగారెడ్డి రాష్ట్ర అధ్యక్షులు ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్
- మదన్ సూపర్ స్పెషాలిటీ కంటి ఐ ఆసుపత్రిలో ముగిసిన జర్నలిస్టుల ఉచిత కంటి వైద్య శిబిరం

**అంకుశం న్యూస్ అనంతపురం మార్చి 30:** రాబోవు రోజుల్లో జర్నలిస్టుల సంక్షేమం కోసం రాజీలేని పోరాటం చేస్తామని జర్నలిస్టులకు అన్ని విధాలుగా అండగా ఉంటామనివర్కింగ్ జర్నలిస్టుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలని నిర్లక్ష్యంగా ఉండకూడదని అని ప్రమాదకరమని జర్నలిస్టుల సంక్షేమము, అభివృద్ధి, ఆరోగ్యమే లక్ష్యంగా రాబోవు రోజుల్లో వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ మరింతగా పనిచేస్తుందని జర్నలిస్టులు అందరూ ఐకమత్యంగా ముందుకెళ్లేందుకు కృషి చేస్తామని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు మచ్చా రామలింగారెడ్డి అన్నారు ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ ఏపీ జర్నలిస్టు డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా జరుగుతున్న వర్కింగ్ జర్నలిస్టుల ఉచిత కంటి వైద్య శిబిరం ముగింపు సమావేశం మదన్ సూపర్ స్పెషాలిటీ ఐ ఆసుపత్రి నందు జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మచ్చా రామలింగారెడ్డి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మదన్ మోహన్ రెడ్డి పాల్గొని జర్నలిస్టుల ఉచిత కంటి వైద్య శిబిరాన్ని పూర్తి చేశారు ఈ సందర్భంగా ముఖ్య అతిథి మచ్చా రామలింగారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా అనంతపురం జిల్లాలో ఒక నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని శ్రీ మీనాక్షమ్మ ఫౌండేషన్ చైర్మన్ రవికాంత్ రమణా సహకారంతో జర్నలిస్టులకు వారి కుటుంబ సభ్యులకి మొట్టమొదటిసారిగా ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించామని పెద్ద ఎత్తున జర్నలిస్టులు, కుటుంబాలు ఉపయోగించుకున్నారని వారికి అభినందిస్తున్నామని మచ్చా రామలింగారెడ్డి అన్నారు రెండు రోజులపాటు జరిగిన ఉచిత కంటి శిబిరంలో పరీక్షలు అనంతరం జర్నలిస్టులకు వారి కుటుంబ సభ్యులకు రెండో విడతలో కంటి అద్దాలు పంపిణీ చేయడం జరుగుతుందని మూడో విడతలో అవసరమైన వారికి కంటి ఆపరేషన్లు ఉచితంగా చేయడం జరుగుతుందని మచ్చా రామలింగారెడ్డి వివరించారు రాబోవు రోజుల్లో ఇటువంటి కార్యక్రమాలు మరిన్ని అనంతపురం జిల్లాలో నిర్వహించి జర్నలిస్టులకు ఉపయోగపడే విధంగా వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ పని చేస్తుందని అన్నారు డాక్టర్ మదన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టులకు ఉచిత కంటి వైద్య శిబిరం మా హాస్పిటల్ లో నిర్వహించడం అభినందనీయమని ఎందుకోసం కృషి చేసిన రవికాంత్ రమణగారికి రాష్ట్ర అధ్యక్షులు మచ్చా రామలింగారెడ్డి గారికి ధన్యవాదాలు తెలుపుతున్నామని అన్నారు జర్నలిస్టులకు వారి కుటుంబ సభ్యులకి రెండు రోజులపాటు అన్ని వైద్య పరీక్షలు నిర్వహించామని కంటికి సంబంధించిన డ్రాప్స్ ఇతర మందులు అన్ని ఉచితంగా ఇవ్వడం జరిగిందని అన్నారు ఈ కార్యక్రమంలో షాకీర్ బాలు కుల్లాయి స్వామి సాయి నాని రఘు వెంకట్ శంకర్ శ్రీనివాసులు విజయ్ తదితర జర్నలిస్టులు పాల్గొన్నారు రెండో రోజు పెద్ద ఎత్తున జర్నలిస్టులు వారి కుటుంబ సభ్యులు ఉచిత కంటి శిబిరంలో పాల్గొని పరీక్షలు చేయించుకున్నారు

# మన ఊరు -- మన జెండా పై బీజేపీ నాయకుల సమావేశం



**అంకుశం న్యూస్ ధర్మవరం , మార్చి 30:** భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో మన ఊరు -- మన జెండా కార్యక్రమాన్ని విజయవంతం చేసే దిశగా ధర్మవరం నియోజకవర్గం బత్తలపల్లి మండల కేంద్రంలోని ఆర్కే ఫంక్షన్ హాల్‌లో ముఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ నియోజకవర్గ ఇన్చార్జ్ హరీష్ బాబు అధ్యక్షత వహించి, పార్టీ నాయకులు, కార్యకర్తలతో విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా హరీష్ బాబు మాట్లాడుతూ, ఏప్రిల్ 6న భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న మన ఊరు -- మన జెండా కార్యక్రమం పార్టీకి అత్యంత ప్రాధాన్యత కలిగినదని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రతి గ్రామానికి, ప్రతి బూత్ స్థాయికి పార్టీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యమని పేర్కొన్నారు. గ్రామాల వారీగా కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించాలని, ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. పార్టీ జెండాను ప్రతి గ్రామంలో గర్వంగా ఎగురవేసే విధంగా కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించాలని పిలుపునిచ్చారు. అలాగే, ఈ కార్యక్రమం కేవలం ఒక కార్యక్రమంగా కాకుండా, పార్టీ బలోపేతానికి, ప్రజలతో మమేకం అయ్యే ఒక ఉద్యమంగా తీసుకోవాలని నాయకులకు సూచించారు. ప్రతి కార్యకర్త బాధ్యతతో పనిచేస్తే నియోజకవర్గంలో పార్టీ మరింత బలపడుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో మండల, గ్రామ స్థాయి నాయకులు, బూత్ అధ్యక్షులు, ముఖ్య కార్యకర్తలు పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించారు. రాబోయే రోజుల్లో కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయడానికి కార్యాచరణ ప్రణాళికను రూపొందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి సాకే ఓబులేష్, బిజెపి మండల అధ్యక్షులు భాస్కర్, బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శి కోటి సుధా, ఆకులేటి వీరనారప్ప, కావేటి మల్లికార్జున, సురేంద్ర నాయుడు, వెంకటేశ్వర్ రెడ్డి, వెంకటేశ్వర్లు చౌదరి, పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పేదరిక నిర్మూలనే లక్ష్యంగా అడుగులు

- విజయవంతంగా పీ4 తొలి ఏడాది ప్రస్థానం
- నేడు రాప్తాడులో ఎమ్మెల్యే పరిటాల సునీత ఆధ్వర్యంలో భారీ కార్యక్రమం




**రాప్తాడు, అంకుశం న్యూస్ మార్చి 30:** నవ్యాంధ్రప్రదేశ్ సమగ్ర వికాసం కోసం ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'స్వర్ణాంధ్ర విజన్ 2047' లక్ష్యాల సాధనలో 'పీ4 -- జీరో పావర్టీ' కార్యక్రమం కీలక మైలురాయిని చేరుకుంది. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో పాటు ప్రజల భాగస్వామ్యాన్ని మేళవించి అమలు చేస్తున్న ఈ కార్యక్రమం ఏడాది కాలాన్ని విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా రాప్తాడు ఎంపీడీవో కార్యాలయంలో ఎమ్మెల్యే పరిటాల సునీత ఆధ్వర్యంలో ప్రత్యేక సమీక్షా కార్యక్రమం నిర్వహించారు. ఈ బృహత్తర యజ్ఞంలో భాగంగా మండల వ్యాప్తంగా అత్యంత పేదరికంలో ఉన్న 6,114 'బంగారు కుటుంబాలను' గుర్తించగా, ఇప్పటికే 2,488 కుటుంబాలను వివిధ అభివృద్ధి సంస్థలు దాతల ద్వారా దత్తత తీసుకోవడం గమనార్హం. క్షేత్రస్థాయిలో ఈ కుటుంబాల ఆర్థిక స్థితిగతులను పర్యవేక్షించి, వారిని అభివృద్ధి పథంలో నడిపించేందుకు 549 మంది 'మార్గదర్శులు' అంకితభావంతో కృషి చేస్తున్నారు. ఈ ప్రత్యేక కార్యక్రమంలో మార్గదర్శులు మరియు లబ్ధిదారులైన బంగారు కుటుంబాలతో నేరుగా చర్చలు జరిపి, ఏడాది కాలంలో వారి ఆదాయ వనరులు, విద్య, ఆరోగ్య ప్రమాణాల్లో వచ్చిన మార్పులను లోతుగా విశ్లేషించనున్నారు. కేవలం సంక్షేమ పథకాలకే పరిమితం కాకుండా, ప్రతి పేద కుటుంబాన్ని స్వయం సమృద్ధి దిశగా నడిపించి, 2047 నాటికి రాష్ట్రంలో పేదరికం అనే మాటే వినిపించకుండా చేయడమే ఈ పీ-4 నమూనా ప్రధాన ఉద్దేశ్యంగా భావిస్తున్నారు. క్షేత్రస్థాయి అనుభవాలను పరిగణనలోకి తీసుకుని, రాబోయే రోజుల్లో మిగిలిన కుటుంబాల దత్తత ప్రక్రియను కూడా వేగవంతం చేసేందుకు ప్రణాళికలు రూపొందించనున్నారు.

## ఎన్టీఆర్ కి 'భారతరత్న' కోరుతూ చేనేత కార్మికుడి పాదయాత్ర..



**అంకుశం న్యూస్ ధర్మవరం మార్చి 30:** దివంగత నేత ఎన్టీఆర్ కి భారతరత్న ఇవ్వాలని కోరుతూ శ్రీ సత్య సాయి జిల్లా ధర్మవరం పట్టణానికి చెందిన చేనేత కార్మికుడు బి.ఎల్ నరసింహులు 43 రోజుల మాలధారణతో పాదయాత్ర చేపట్టారు. కృష్ణా జిల్లా నిమ్మకూరు నుంచి ప్రారంభమైన ఈ యాత్ర తిరిగి అక్కడే ముగిసింది. ఎన్టీఆర్ దంపతుల విగ్రహం వద్ద నరసింహులు తన యాత్రను విరమించగా, పామర్రు ఎమ్మెల్యే వర్లకుమార్ రాజా ఆయనకు నిమ్మరసం ఇచ్చి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వర్లకుమార్ రాజా మాట్లాడుతూ.. తెలుగువారి ఆరాధ్య దైవంగా తెలుగుజాతి కీర్తిని దశ దిశలుగా చాటిన వ్యక్తిగా, రాజకీయాలలో సంస్కరణలకు శ్రీకారం చుట్టిన మహనీయులుగా, ప్రజా జీవితంలో చేసిన సేవలకు గుర్తింపుగా భారత తన పరిష్కారం నందమూరి తారక రామారావుకు సముచితస్థానమని, నందమూరి తారక రామారావుకు భారతరత్న అవార్డు ఇవ్వాలని అన్నారు. బి.ఎల్ నరసింహులు మాట్లాడుతూ.. కృష్ణాజిల్లాలో 43 రోజులు పాటు ఎన్టీఆర్ కి భారతరత్న ఇవ్వాలని చేపట్టిన పాదయాత్ర నేటితో విజయవంతంగా ముగిసింది అన్నారు. నా పాదయాత్రలో నాకు సహకరించిన ఎన్టీఆర్ అభిమానులకు, తెలుగుదేశం పార్టీ నాయకులకు కార్యకర్తలకు, నందమూరి బాలకృష్ణ అభిమానులకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానన్నారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ నాయకులు బి ఎల్ నరసింహులును సత్కరించి ఆయన నిబద్ధతను కొనియాడారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఈత రాక బాలుడు మృతి! గొట్లూరులో విషాదం!



**అంకుశం న్యూస్ ధర్మవరం మార్చి 30:** ధర్మవరం మండలం గొట్లూరు గ్రామానికి చెందిన వెంకీ, వయసు :-12సంవత్సరాలు, S/o నారాయణస్వామి, అను బాలుడు తన తోటి స్నేహితులతో వారి గ్రామంలోగల బావిలోకి ఈతకు వెళ్లి వెంకీ కి ఈత సరిగా రాక నీళ్లలో మునిగి చనిపోయినాడు. వెంకీ ధర్మవరం లో ఒక ప్రైవేటు స్కూల్ లో 6వ తరగతి చదువుతున్నాడు. వెంకీ తండ్రి వ్యవసాయం చేస్తాడు. వెంకీ కి ఇద్దరు అక్కలు వున్నారు.ఈ సంఘటన గ్రామం లో విషాదం నెలకొంది.

## తండ్రిని చంపిన తనయుడికి జీవిత ఖైదు, జరిమాన

- విజయనగరం జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్,



**అంకుశం న్యూస్ విజయనగరం మార్చి 30:** విజయనగరం జిల్లా, 2వ పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో 2025 సం.లో నమోదైన హత్య కేసులో నిందితుడు విజయనగరం పట్టణం, గాజులరేగకు చెందిన కర్నపు సాయి (20 సం.లు)కు జీవిత ఖైదు, రూ.2,000/-లు జరిమాన విధిస్తూ విజయనగరం డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జ్ శ్రీమతి ఎం. బబిత గారు గారు తీర్పు వెల్లడించినట్లుగా జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్, మార్చి 30న తెలిపారు. వివరాల్లోకి వెళ్ళితే.. విజయనగరం పట్టణం, గాజులరేగకు చెందిన కర్నపు సాయి (20 సం.లు) తన తండ్రితో కలిసి నివాసం ఉంటున్నాడన్నారు. తన తండ్రి పేరు మీద ఉన్న ఇల్లును తనకు ఇచ్చేయమని, కొడుకు కొంతకాలంగా తండ్రిని అడగగా, తండ్రి అందుకు నిరాకరించగా తేది 13.02.2025న రాత్రి ఇంటికి తాగి వచ్చి తండ్రిని చేతులతో గుండె మీద బలంగా గుద్ది, కాళ్ళతో తన్ని చంపేసాడన్నారు. మృతుడి భార్య తన కూతురుతో వేరేగా నివాసం ఉంటున్నారన్నారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ బి.మురళి అనుమానాస్పద మృతిగా కేసు నమోదుచేయగా, విజయనగరం 2వ పట్టణ పోలీసు స్టేషన్ సిఐ టి.శ్రీనివాసరావు దర్యాప్తు చేపట్టి, హత్య కేసుగా ఆల్టర్ చేసి, నిందితుడును అరెస్టు చేసి, రిమాండుకి తరలించి, న్యాయస్థానంలో అభియోగ పత్రం దాఖలు చేశారన్నారు. ఈ కేసులో ప్రాసిక్యూషను త్వరితగతిన పూర్తి చేసేటట్లు పోలీసు మరియు జ్యుడిషియల్ అధికారులు చర్యలు చేపట్టారని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ తెలిపారు.

## నవనీత కృష్ణుడిగా అలరించిన ఒంటిమిట్ట రామయ్య



**అంకుశం న్యూస్ కడప మార్చి 30:** ఒంటిమిట్టలోని శ్రీ కోదండరామస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు సోమవారం ఉదయం స్వామివారు నవనీత కృష్ణాలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 7.30 గంటల నుండి స్వామివారి ఊరేగింపు వైభవంగా జరిగింది. కేరళ డ్రమ్స్, భక్తజన బృందాల చెక్కభజనలు, కోలాటాలతో స్వామివారిని కీర్తిస్తూ మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపు కోలాహలంగా సాగింది. మార్గమంతా భక్తులు కర్పూరహారతులు సమర్పిస్తూ స్వామివారిని భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. పురాణాల ప్రకారం బాలకృష్ణుడు వెన్నదొంగగా ప్రసిద్ధి. యశోదమ్మ ఇంట్లోనే కాక రేపల్లెలోని ప్రతి ఇంటికీ వెళ్లి వెన్నను ఆరగించేవాడని కథలు చెబుతాయి. ఈ బాలకృష్ణుడి లీలలను స్మరింపజేస్తూ రాములవారు వెన్నకుండతో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో శ్రీమతి ప్రశాంతి, సూపరింటెండెంట్ హనుమంతయ్య, టెంపుల్ ఇన్స్పెక్టర్ నవీన్‌తో పాటు విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## మనోజ్ నేతృత్వంలో అనపర్తి నియోజకవర్గంలో ఘనంగా టిడిపి ఆవిర్భావ వేడుకలు



**తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ మార్చి 30:** అనపర్తి నియోజకవర్గంలో వాడవాడలా యువనేత నల్లమిల్లి మనోజ్ నేతృత్వంలో పసుపుజెండా ఎగురవేసిన టిడిపి నాయకులు, కార్యకర్తలు ముందుగా రామవరం గ్రామంలో టిడిపి ఆవిర్భావ వేడుకల్లో పాల్గొని ముందుగా పసుపు జెండా ఎగురవేసి అన్న ఎన్ టి రామారావు విగ్రహం వద్ద నివాళులు అర్పించిన నల్లమిల్లి మనోజ్ రెడ్డి. అనంతరం కర్రి జట్లారెడ్డి ఫంక్షన్ హాల్ లో జరిగిన ఆవిర్భావ దినోత్సవ సభలో ఉత్తమ కార్యకర్తలను సన్మానించిన మనోజ్ రెడ్డి ఈ కార్యక్రమంలో తమలంపూడి సుధాకర్ రెడ్డి,కొవ్వూరి శ్రీనివాసరెడ్డి(దత్తుడుశ్రీను), సిరసపల్లి నాగేశ్వరరావు, కర్రి వెకటరామారెడ్డి, సత్తి దేవానంద్ రెడ్డి (బాబా) ,కర్రిశేషారత్నం మరికొందరు టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.